# జేబు రుమాలు

రచన:
కొండేపూడి సూర్యకామరాజు

ఎక్కడ అలివేణి? ఎక్కడ హనుమంతరావు? వీళ్ళిద్దరి మధ్యా ప్రేమ అనే విద్యుచ్ఛక్తి ప్రవహింపజేసింది జేబురుమాలు. అంచేత జేబురుమాల్ని "గుడ్ కండక్టర్ ఆఫ్ లవ్" అని చెప్పవచ్చు.

హనుమంతరావు బీచిలో ఒక ప్రత్యేక స్థలం నిర్ణయించుకున్నాడు–శాండల్ పాయింటు దగ్గిర. తను విశాఖపట్నం వచ్చిన దగ్గరనుండీ అంటే యించుమించు 365 రోజులబట్టీ అక్కడే కూర్చుంటూ వచ్చాడు సాయంసమయాల్లో. అలివేణికూడా అట్లాగే ఒక స్థలం స్వంతంచేసుకుంది–అతనికి కొద్దిదూరంలో. వీళ్లిద్దరి మధ్య దూరం ఏరోజు కొలచినా పదిగజాలే వుంటుంది. ఆ బీచికి అట్టే జనం రాకపోవడంవల్ల వాళ్ళ స్థలాలు దురాక్రమణకి గురయ్యేవికావు. అన్నాళ్ళనుండీ వాళ్ళిద్దరు ఆవిధంగా ప్రక్క ప్రక్కనే కూర్చుంటోన్నా, ఆమె కదలికవల్ల రేగిన యిసుక గాలికి కొట్టుకొచ్చి అతని కళ్ళల్లో పడటం వినా, యేవిధమైన సంబంధం ఏర్పడలేదు–వాళ్ళిద్దరిమధ్యా. హనుమంతరావు చిత్రకారుడు కావడంవల్ల అక్కడ కనపడే ప్రకృతి దృశ్యాలన్నీ చిత్రించేవాడు, చిత్తుకాగితాలమీద.

ఒకరోజు మామూలుగా బీచికిపోయి కూర్చున్నాడు హనుమంతరావు. చంకలో తెల్ల కాగితాలు మార్గమధ్యంలో గాలి కెగిరిపోయాయన్న సంగతి చంకలో చెయ్యిపెట్టి చూశాక తెలిసింది పాపం! అతడికి కాగితాలూ లేవు, దృశ్యాలూ లేవు (అక్కడి ప్రకృతి దృశ్యాలన్నీ అప్పటికే చిత్రించాడు) చిత్రించటానికి. తనకి పదిగజాల దూరంలోవున్న పదార్థంతో చిత్రలేఖనపు టాకలి తీర్చుకుందామని చూశాడు. కాని కాగితమేది? సమయస్ఫూర్తి గల బుర్ర కాబట్టి జేబులోంచి తీసాడు జేబురుమాల్ని. ఉత్త అలంకారార్థం మడతమడతగానే వుపయోగించిన జేబురుమాలు కాబట్టి తెల్లగావుంది–అలివేణి జడలో బొడ్డుమల్లెపువ్వు లాగ. ఒక్కొక్క చూపుతో ఒక్కొక్క అవయవపు టొంపుల్నే అవగాహన చేసుకుని తర్జుమా చేస్తున్నాడతను జేబు రుమాలు మీద, ఆ సోగకన్నులు–బరువైన రెప్పలు–చిరుజుట్టు జీరాడుతూవున్న నొసలు–స్వేచ్ఛగా సముద్రపు గాలిని పీల్చుకోటానికి ముందుకు పొడుచుకొచ్చిన ముక్కు–గాలికి కందిన పెదవులు–కొంచెం ఎర్రబడ్డబుగ్గలు–వయ్యారమైన వంపులుగల వక్షమూ అచ్చుపడిపోయాయి అతని జేబురుమాలుమీద–తయారయింది వలివేణి రూపాంతరం.

ఏడాదినుండి ఆమెవైపు నుంచి అతనివైపుకు వీచేగాలి ఒక్కసారిగా మళ్ళింది, అతనివైపు నుండి ఆమెవైపుకు. దాంతో ఆ జేబురుమాలు నలదమయంతిలో హంసలాగ యెగిరి, భూమి ఆకాశం ముద్దుపెట్టుకుంటున్న దృశ్యం చూస్తూన్న మగువముఖాన్ని పూర్తిగాకప్పేసింది. కొంచెం విసురుగా వీచినగాలి రుమాల్లోవున్న ఆ సెంటు వాసనకి ఆమె కనురెప్పలు మూసుకుపోయాయి. ఇదే సందని పమిటచెరగు తొలగి తెరచాపలాగ గాలిలో ఎగురుతోంది. జైల్లోంచి బయటపడ్డట్టు వుప్పొంగింది వక్షం. ఇదంతా చూస్తొంటే కళ్లు జిగేలు మన్నాయి హనుమంతరావుకి. నిశ్చేష్టుడై అట్లాచూస్తూనే వున్నాడు నోరు తెరచుకొని.

ఎట్లా అయితే నేం కొంచెం సేపటికి తెలివివచ్చింది అలివేణికి. తన ప్రతిబింబం జేబురుమాల్లో అందంగా చిత్రించబడి వుండటం చూసింది. మనసారా ముద్దుపెట్టుకుంది తన ప్రతిని, రుమాలుకు ఒకమూలగా వ్రాయబడ్డ 'హనుమంతరావు' అన్న పేరుకూడా అనుకోకుండా ఆమె పెదవులకు తాకింది. పక్కకు చూసింది. అతని నల్లటి ముఖం ఆమెను భయపెట్టింది. అతడు అప్రయత్నంగా నవ్వాడు. అతని తెల్లటి పళ్ళు ఆమె భయాన్ని పోగొట్టాయి. ఆమెలేచి వెళ్ళి అందిచ్చిందతనికి రుమాల్ని. హనుమంతరావు రుమాల్తోపాటు అలివేణి పాణినికూడా గ్రహించాడు. రుమాలు ఇద్దరి చేతుల్ని ముడిపెట్టింది. ఇద్దరూ ఒక్కసారి నవ్వారు. ఆ కలుసుకున్న చేతులు రెండూ రిష్టువాచీ టకటకలతోటీ, గాజుల గలగలలతోటి వుయ్యాల వూగుతూ ఆ సంధ్య చీకట్లో బీచంట దూరంగా నడిచిపోయాయి.